ఎస్పీడీసీఎల్‌లో భారీ అవినీతి! 8 మంది సిబ్బందిపై వేటు.. ఏబీసీకి ఫిర్యాదు

విశ్వంభర, తెలంగాణ బ్యూరో:
టీజీఎస్పీడీసీఎల్‌లో అవినీతికి పాల్పడినట్లు నిరూపితమైన 8 మంది సిబ్బందిపై మేనేజ్మెంట్ వేటు వేసింది. ఇందులో 4 గురు ఇంజనీర్లు, ముగ్గురు లైన్ మేన్లు, ఓఆర్టిజన్ ఉన్నారు. బుధవారం ఒకేసారి 8 మం దిని ప్రభుత్వం సస్పెండ్ చేసింది. టీజీఎస్పీడీసీఎల్ పరిధిలో అవినీతికి తావు లేకుండా ఉండేందుకు మేనేజ్మెంట్ యాంటీ బ్రైబరీ సెల్ (ఏబీసీ) ని ఏర్పాటు చేసింది.ఈ సెల్‌కు వచ్చిన ఫిర్యాదులపై ఇంటెలిజెన్స్ విభా గం విచారణ చేపట్టగా... కీలక విషయాలు వెలుగు చూశాయి. ఛా ర్జింగ్ స్టేషన్ ఏర్పాటు,కొత్త కనెక్షన్లు, ప్యానెల్ బోర్డుల ఏర్పాటు, ట్రాన్స్ ఫార్మర్ మంజూరు వంటి వాటికి విద్యుత్ ఉద్యోగులు లంచాలు తీసుక ున్న ట్లు వెల్లడైంది. యూపీఐ ద్వారా లంచాలు స్వీకరించినట్లు ఆధారా లు లభించాయి. దీంతో బాధ్యులపై ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

ఇంకా అనేక ఫిర్యాదులు..
టీజీఎస్పీడీసీఎల్ పరిధిలో ఇప్పుడు దొరికిన వాళ్లంతా కేవలం చిన్న చేపలే అని ఇంకా అనేక మంది అవినీతిపరులైన అధికారులు ప్రజల ను లంచాల కోసం పీడిస్తున్నారనే ఆరోపణలున్నాయి. కార్పొరేషన్ పరిధిలో అవినీతి పరుల భరతం పట్టేందుకు గాను సీఎండీ ముషారఫ్ ఫరూఖీ సెప్టెంబర్ 2024లో యాంటీ బ్రైబరీ సెల్ ను ఏర్పాటు చేశారు. ఇందుకోసం 04023454884, 7680901912 నెంబర్లను ఏర్పాటు చేశారు. ఆఫీసు వేళల్లో ఈ నెంబర్లకు ఫోన్ చేసి కార్పొరేషన్ పరిధిలో లంచం డిమాండ్ చేస్తున్న వారిపై ఫిర్యాదు చేయవచ్చు. అయితే ఇప్పటి వరకు పెద్ద ఎత్తున

ఫిర్యాదులు వచ్చాయని, ఇంటెలి జెన్స్ విభాగంలో కొన్ని ఫైళ్లు, చర్యలు తీసుకోవాల్సిన హెచ్ఆర్డీ విభా గంలో మరికొన్ని ఫైళ్లు పెండింగులోనే ఉండిపోయాయనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. అవినీతికి పాల్పడినట్లు ఆధారాలతో సహా ఫైల్ సిద్ధంగా ఉన్న వారిలో ఇప్పుడు కేవలం 8 మందిపై మాత్రమే చర్యలు తీసుకున్నారని, చాలా మందిపై చర్యలు చేపట్టడం లేదని సమాచారం. అవినీతికి పాల్పడిన వారి వివరాలను కూడా అధికారికంగా విడుదల చేయకపోవడం గమనార్హం.

కాంగ్రెస్ అవినీతి పాలనను చూస్తూనే ఉన్నాం

విశ్వంభర, హైదరాబాద్: అవినీతి విధా నాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ పార్టీ ప్రభు త్వ పనితీరును తెలంగాణ రాష్ట్ర ప్రజలు గమనిస్తూనేఉన్నారని రాజేంద్రనగర్ నియో జకవర్గం అత్తాపూర్ సర్కిల్ హైదర్గూడా డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు చిట్టి గారి నరేందర్రావు అలియాస్ పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వా నికి వ్యతిరేకంగా ఓటు వేసిన ఒక్క కౌని ్సలర్ అభ్యర్థి గెలిచిన స్థానంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవడం ఎం తవరకు సమంజసమని ఆయన ప్రశ్నిం చారు. కల్వకుర్తి నియోజకవర్గం అమంగల్ మున్సిపాలిటీలో కేవలం ఒకే ఒక కాం గ్రెస్ పార్టీ అభ్యర్థి గెలిస్తే బిజెపి కౌన్సిలర్లల సహకారంతోదొడ్డిదారిన మున్సిపల్ చైర్మన్ పదవిని కైవసం చేసుకోవడం సిగ్గుచేటు అని ఆయన మండిపడ్డారు.క్యాతన పల్లి మున్సిపాలిటీలో మెజారిటీ అభ్యర్థులు బిఆర్ఎస్ పార్టీ గెలిస్తే స్థానికంగా తన ఉనికిని కోల్పోతున్నారని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ను అరెస్టు చేయించి తన అభ్యర్థులను గెలిపించుకునేందుకు కుట్ర పన్నుతు న్నారని వివేక్ వికృతి చేష్టలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారన్నారు. రానున్న గ్రేటర్ హైదరా బాద్ మున్సిపల్ ఎన్నికల్లో బి ఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు ఘనవిజయం సాధిస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే మాజీమంత్రి సబితాఇంద్రారెడ్డి రాజేం ద్ర నగర్ నియోజకవర్గం టిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని అన్ని కార్పొరేట్ స్థానాలను గెలుచుకొని కేసీఆర్ కు బహు మతిగా ఇస్తామని తెలిపారు. ఇటీవల జరిగిన కేసీఆర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజలకు చేరవేసేందుకు సిద్ధం చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

తెలంగాణ ఆర్యవైశ్య సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ నీలా శ్రీధర్

విశ్వంభర, హైదరాబాద్:

తెలంగాణ ఆర్యవైశ్య సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ నీలా శ్రీధర్ ఎన్నికయ్యారు. . ఐదు సంవత్సరాలు పదవీకాలంలో ఉంటారని బొమ్మిడి శివకుమార్ తెలిపారు . త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా అధ్యక్షులను నియమిస్తు న్నట్లు, వైశ్యల సంక్షేమం కోసం పాటుపడ తా నని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. వచ్చే మున్సిపల్ ఎలక్షన్స్ లలో అన్ని పార్టీలు వైశ్యు లకు ప్రాధాన్యత నివ్వాలని ఆయన ఈ సంద ర్భంగా అన్ని పార్టీలను కోరారు. సామాజికంగా ఆర్థికంగా వెనుకబడిన ఆర్యవైశ్యులను ఆదుకో వాలని వైశ్యుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్యా చరణప్రణాళికనురూపొందించాలని, ముందుకు వెళ్లాలని, వచ్చే బడ్జెట్లో పెద్ద మొత్తం నిధులు కేటాయించాలని, సీఎం రేవంత్ రెడ్డిని మరియు ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్కను ఈ సందర్భంగా డాక్టర్ నీలా శ్రీధర్ వారిని కోరారు

వరంగల్ దళితులపై రేవంత్ సర్కార్ 'బుల్డోజర్ రాజ్యం

ఇళ్లు కూల్చడం అమానుషం: ఎమ్మెల్సీ డా. దాసోజు శ్రవణ్

విశ్వంభర, వరంగల్:
వరంగల్ నగరంలోని భద్రకాళి ఆలయం పరిసరాల్లోని చెరబండ రాజు నగర్ కాలనీలో దశాబ్దాలుగా, దాదాపు 60--70 సంవత్సరాలుగా నివస ్తున్న దళిత కుటుంబాల ఇళ్లను కూల్చివేయడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలుఅత్యంత పాశవికమని ఎమ్మెల్సీ డా. దాసోజు శ్రవణ్ తీవ్రంగా ధ్వజమెత్తారు. బుధవారం మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, ఎమ్మెల్సీ డా. దాసోజు శ్రవణ్ ,బిఆర్ఎస్ పార్టీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో బా ధిత కుటుంబాలతో కలిసి తెలంగాణరాష్ట్ర మానవహక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్ను కలిసి ఫిర్యాదు చేశారు.లగచర్లలో గిరిజను లపై జరిగిన దాడులను ప్రజలు మర్చిపోకముందే, ఇప్పుడు వరంగల్‌లో "అభివృద్ధి", "ప్రాజెక్టులు", "మాడ వీధులు" పేరుతో కనీస డ్యూ ప్రాసెస్ లేకుండా, ముందస్తు నోటీసులు ఇవ్వకుండా దళిత కుటుంబాల ఇళ్లను కబ్జా చేసి కూల్చివేయాలని ప్రయత్నించడం బుల్డోజర్ రాజ్యానికి నిదర్శ నమని డా. శ్రవణ్ విమర్శించారు. తాగునీటి కనెక్షన్లు కట్ చేయడం, కరెంట్ నిలిపివేస్తామని బెదిరించడం ద్వారా కుటుంబాలను హింసిస్తూ ఇళ్లు ఖాళీ చేయించేందుకు ప్రయత్నించడం అమానుష చర్య అని మండ ్పడ్డారు. చిన్నపిల్లలు తాగునీరు లేక స్కూళ్లకు వెళ్లలేని పరిస్థితి నెలకొనడం దురదృష్టకరమని పేర్కొన్నారు.బాధితులు కలెక్టర్, కమిషనర్‌ను కలిసి విజ్ఞప్తి చేసినప్పటికీ స్పందన రాలేదని తెలిపారు. చివరకు మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించగా, చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్ మానవత్వంతో స్పందించి, ఇది రాజ్యాంగ ఉల్లంఘన అంశమని అభిప్రాయపడి తక్షణ

ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. మార్చి 9న అమలుపై సమీక్ష చేస్తామని కమిషన్ స్పష్టం చేసినట్లు తెలిపారు."ఇదేనా ప్రజా పాలన? ఇదేనా జై సంవిధానం? ఇదేనా జై భీమ్?" అంటూ ప్రభుత్వాన్ని డా. శ్రవణ్ ప్రశ్నించారు. పేదల ఇళ్లు కూల్చే హక్కు ప్రభుత్వానికి లేదని, తాగునీరు నిలిపివేసి బలవంతంగా ఖాళీ చేయించడం ప్రజాస్వామ్యం కాదని, అది నిరంకుశత్వమని విమర్శించారు.తెలంగాణ లోని దళిత, గిరిజన సంఘాలు సంఘటితమై ఈ రాజ్యాంగ విరుద్ధ చర్య లకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాన్ని కట్టడి చేయాలని కోరారు. కలెక్టర్ సహా సంబంధిత అధికారులు మానవ హక్కుల కమిషన్ ఇచ్చిన ఆదేశా లను యథాతథంగా అమలు చేయాలని, దళితుల హక్కులు మానవత్వం కాపాడాలని ఎమ్మెల్సీ డా. దాసోజు శ్రవణ్ డిమాండ్ చేశారు.

ఓటరు జాబితాల సవరణపై ఈఆర్వోలకు శిక్షణ

విశ్వంభర, తెలంగాణ బ్యూరో:
ఎన్నికల జాబితాల పరిశుభ్రతను కాపాడడం ఈఆర్వోల కీలక బాధ్యత అని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. అర్హు లైన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాల్లో చేర్చడంతో పాటు, అనర్హుల పేర్లను చట్టబద్ధంగా తొలగించాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. గురువారం హైదరాబాద్‌లోని సీఈఓ కార్యాలయంలో నాలుగు జిల్లాలకు చెందిన ఎన్నికల నమోదు అధికారులకు (ఈఆర్వోలు) ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు చెందిన మొత్తం 50 మంది ఈఆర్వోలు ఈ శిక్షణ లో పాల్గొన్నారు. ఈ శిక్షణలో ఓటరు జాబితాల తయారీ, సవరణ, నిర్వ హణవిధానాలపై సమగ్ర అవగాహనకల్పించడంతో పాటు, త్వరలో చేపట్ట నున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)పై వివరంగా చర్చించారు. ఎన్నికల జాబితాల్లో ఖచ్చితత్వం, పారదర్శకత, సమగ్రతను పాటించేం దుకు ఫీల్డ్ స్థాయి అధికారుల సామర్థ్యాన్ని పెంపొందించడం ఈ కార్యక్ర మం ప్రధాన లక్ష్యంగా ఉందని అధికారులు తెలిపారు. క్లెయిమ్స్, ఆబ్జెక్షన్ల పరిశీలన, చట్టపరమైన నిబంధనలు, సమయపట్టికల అమలు, సాంకే

తికత వినియోగంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఎస్ఐఆర్ అమలులో ఎదురయ్యే సవాళ్లు, పరిష్కారాలపై చర్చించగా, అధికారుల సందేహాలను నివృత్తి చేసే ఇంటరాక్టివ్ సెషన్లు కూడా నిర్వహించారు. స్వేచ్ఛాయుత, ని ష్పక్షపాత,పారదర్శక ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం చేపడు తున్న చర్యల్లో భాగంగా శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు సీఈఓ తెలిపారు.

కమాండ్ కంట్రోల్ సేవలు ఆర్ అండ్ బీ శాఖ కి.. ప్రభుత్వం కీలక నిర్ణయం

విశ్వంభర, తెలంగాణ బ్యూరో :

హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12లో ఉన్న ప్రతిష్టాత్మకమైన తెలంగాణ ఇంట ్రిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ సేవల (ఎఫ్ఎంఎస్) టెండర్ల నిర్వహణ బాధ్యత రోడ్లు, భవనాల (ఆర్ అండ్ బీ) శాఖకు అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసు కుంది. ఈ అత్యాధునిక భవనం యొక్క సమగ్ర నిర్వహణ బాధ్యతను రాబోయే 3 ఏళ్ల కాలప రిమితికి గాను ఆర్ అండ్ బీ శాఖకు టెండర్ల నిర్వహణ కొరకు అప్పగించారు. ఈ నేపథ్యం లో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా భవన నిర్వహణను చేపట్టేందుకు వివిధ అను భవజ్ఞులైన సంస్థల నుంచి టెండర్లను ఆహ్వానిం చారు. ఎంపికైన సంస్థ టీజీఐసీసీసీ భవనం రోజువారీ నిర్వహణ, సాంకేతిక విభాగాల పర్య వేక్షణ, ఇతర ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ సేవలను అందిస్తుంది. ఈ ఒప్పందం 3 ఏళ్ల పాటు అమ లులో ఉంటుంది. పారదర్శకతను పాటిస్తూ, అత్యుత్తమ సేవలను అందించే సామర్థ్యం గల సంస్థల నుంచి బిడ్లను ఆర్ అండ్ బీ శాఖ టెండర్లను ఆహ్వానించింది. పోలీసింగ్, విపత్తు నిర్వహణలో కీలక పాత్ర పోషించే కమాండ్ కంట్రోల్ సెంటర్ పనితీరు సజావుగా సాగా లంటే, వృత్తిపరమైన భవన నిర్వహణ ఎంతో అవసరమని, అందుకే కీలకమైన ఈ నిర్ణయం తీసుకున్నట్లు టీజీఐసీసీసీ డైరెక్టర్ వి.బి. కమలాసన్ రెడ్డి పేర్కొన్నారు.

ఉన్నత విద్యలో ఏఐ, క్వాంటం విప్లవం రావాలి..

ఓయూలో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ

విశ్వంభర, తెలంగాణ బ్యూరో:
భారతీయ ఉన్నత విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులకు చారిత్రాత్మక ఉస్మానియా విశ్వవిద్యాలయం వేదికైంది. ఓయూలోని ఠాగూర్ ఆడిటో రియంలో 'అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్శిటీస్' (ఏఐయూ) సహకారంతో ఏర్పాటు చేసిన రెండు రోజుల సెంట్రల్ జోన్ వైస్ ఛాన్సలర్ల సదస్సు 2025-26 గురువారం ఘనంగా ప్రారంభమైంది. ఆరు రాష్ట్రాల నుంచి సుమారు 100 మందికి పైగా ఉపకులపతులు హాజరైన ఈ సదస్సును తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్వాంటం టెక్నాలజీల కలయిక కేవలం శాస్త్రీయ పురోగతి మాత్రమే కాదని, నేటి విద్యా వ్యవస్థకు అత్యంత అవసరమని అభిప్రాయపడ్డారు. మన విశ్వవిద్యాలయాలు కేవలం విదేశీ సాంకేతికతను వాడేవిగా ఉండకూడదని, భారతీయ నైతికత, విలువలను ప్రతిబిం బించేలా స్వదేశీ ఏఐ పరిష్కారాలను రూపొందించే కేంద్రాలుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టా రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక యుగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్వాంటం టెక్నాలజీలు ఉన్నత విద్యా వ్యవస్థను సమూలంగా మారుస్తున్నాయని అభిప్రాయపడ్డారు. ప్రపంచం ఇప్పుడు భౌగోళిక సరిహద్దుల శక్తి నుంచి సాంకేతిక శక్తి వైపు వేగంగా మారుతోందని, భవిష్యత్తులో దేశాల బలం వాటిసాంకేతిక సామర్థ్యంపైనే ఆధారపడిఉంటుందన్నారు. ఇప్పుడు మనం ఇండస్ట్రియల్ రివల్యూషన్ 5.0 దిశగా సాగుతున్నామని, ఇందులో భా గంగా ఆటోమేషన్, బిగ్ డేటా, క్రిప్టోకరెన్సీ, డ్రోన్ టెక్నాలజీలు విద్యారంగంలోని ప్రతి అంశాన్ని ప్రభావితం చేస్తున్నాయని వివరించారు.

సార్వభౌమాధికారానికి కొత్త సవాళ్లు..
సాంకేతికతకు సరిహద్దులు లేవని, ఏఐ, క్వాంటం వంటి టెక్నాలజీలు ఏ ఒక్క దేశానికో పరిమితం కాదని ప్రొఫెసర్ గుర్తు చేశారు. సైబర్ నేరాలు

ఒక దేశంలో పుట్టి ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపుతున్న తరుణంలో, పాత చట్టాలు ప్రస్తుత వేగానికి సరిపోవని ఆయన హెచ్చరించారు. సాంకే తి కత వేగానికి అనుగుణంగా దేశాల సార్వభౌమాధికారాన్ని కాపాడు కుంటూ, కొత్త చట్టపరమైన చట్రాలను రూపొందించుకోవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. కార్పొరేట్ సంస్థలకు సీఎస్ఆర్ ఎలాగైతే తప్పనిసరి అయ్యిందో, 21వ శతాబ్దపు విద్యా సంస్థలు కూడా అకడమిక్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (ఏఎస్ఆర్)ని స్వీకరించాలని ఆయన సూచించారు. ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం మాట్లాడుతూ విద్యావేత్తలు కేవలం జ్ఞానాన్ని అందించే వారిగా కాకుండా ఇంటెలిజెన్స్ ఆర్కిటెక్ట్స్ గా మారాలని సూచించారు. ఓయూలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ ఏఐ అండ్ మెషిన్ లెర్నింగ్ ను స్మార్ట్ సిటీలు, హెల్త్‌కేర్, రవాణా వ్యవస్థల కోసం జాతీయ స్థాయి హబ్‌గా తీర్చిదిద్దుతున్నట్లు ప్రకటించారు. ఈ సదస్సులో తెలంగాణ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలు పాల్గొన్నాయి. పాఠ్య ప్రణాళికలో ఏఐ చేరిక, పారదర్శక పాలనలో సాంకేతికత, మేడ్ ఇన్ ఇండియా ఏఐ ఉత్పత్తుల ప్రోత్సాహం వంటి అంశాలపై ప్రధానంగా చర్చ జరిగింది.

గురుకుల పాఠశాలల పని వేళల్లో మార్పులు: ఉపాధ్యాయ సంఘాల సమావేశంలో సెక్రటరీ హామీ

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని గురుకుల పాఠశాలల పనివేళలు ఉపాధ్యాయులు కోరుతున్న విధంగా మారుస్తామని గురుకుల సొసైటీ కార్యదర్శి కృష్ణ ఆదిత్య హామీ ఇచ్చారు. గురువారం సాంఘిక సంక్షేమ గురుకులాల సొసైటీ లోని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించటానికి ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టీయస్‌యూటీఎఫ్ పక్షాన రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, ప్రధాన కార్యదర్శి ఎ. వెంకట్ సాంఘిక సంక్షేమ గురుకులాల సొసైటీ విభాగం నాయకులు ఎల్లయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణ ఆదిత్య మాట్లాడుతూ, విద్యార్థుల సంక్షేమానికి ఉపాధ్యాయులు ప్రాధాన్యత ఇవ్వాలని, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ఉపాధ్యాయుల సమస్యలపై టిఎస్ యుటిఎఫ్ ఇచ్చిన ప్రాతినిధ్యంపై స్పందిస్తూ ప్రమోషన్ ప్రక్రియ త్వరలో చేపడతామని, సమయం మార్పు చేయడంతో పాటు రాత్రి విధులు నిర్వహించిన వారికి మరుసటి రోజు ఉదయం 9 గంటలకు అనుమతించడానికి అంగీకరించారు. పార్ట్ టైం టీచర్ల వేతనాలు రెండు రోజుల్లో విడుదల చేస్తామని, రెగ్యులర్ ఉపాధ్యాయులకు 010 వేతనాల అమలు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుటకు, కేర్‌టేకర్‌గా అదనపు పోస్టులు మంజూరుకు, ప్రిన్సిపాల్ ప్రమోషన్‌లో సీనియారిటీకి ప్రాధాన్యత ఇస్తూ 100 శాతం ప్రమోషన్ల ద్వారా భర్తీ చేస్తామని తెలియజేశారు.

ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా నివాళి

విశ్వంభర, హైదరాబాద్:

తెలంగాణ హైకోర్టు ప్రాంగణంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా న్యాయ వాదులు ఘనంగా నివాళులర్పించారు. శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన పరాక్రమం, దేశభక్తిని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో పొలాస శంకర్, గాలిబె విశాల్ (మెంబర్, హెచ్‌డీసీ ఈఎస్ఐ హాస్పిటల్ నాచారం), విష్ణువర్ధన్, సూరజ్ యాదవ్, కేవీ రామారావు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

శివాజీ జయంతి..రంజాన్ ఆరంభం నగరంలో ఆధ్యాత్మిక ఉత్సాహం

విశ్వంభర, హైదరాబాద్:

హైదరాబాదు నగరంలో గురువారం ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఒకవైపు ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించగా, మరోవైపు ముస్లింల పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం కావడంతో మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.శివాజీ జయంతి సందర్భంగా నగరవ్యాప్తంగా చిన్న గల్లీల నుంచి ప్రధాన రహదారుల వరకు భారీ ర్యాలీలు నిర్వహించారు. యువత, భక్తులు శివాజీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివిధ సంఘాల ఆధ్వర్యంలో శోభాయాత్రలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడగా, శివాజీ సాహస గాథలను స్మరించుకున్నారు.ఇక రంజాన్ మాసం ప్రారంభం కావడంతో పాతబస్తీ, బోలకపూర్ తదితర ప్రాంతాల్లోని మసీదుల వద్ద ముస్లింలు మొదటి రోజు ప్రత్యేక నమాజులు నిర్వహించారు. ఉదయం నుంచే మసీదులకు చేరుకున్న భక్తులు ప్రార్థనలు చేసి పవిత్ర మాసాన్ని ఆరంభించారు.రెండు భిన్న సంప్రదాయాలకు చెందిన వేడుకలు ఒకే రోజు జరగడంతో నగరంలో ఆధ్యాత్మిక ఉత్సాహం, సౌహార్ద వాతావరణం కనిపించింది.

పేదల దుకాణాలే టార్గెట్...

ఫుట్‌పాత్ ఆక్రమణల పేరుతో చిరు వ్యాపారుల దుకాణాల తొలగింపు...

విశ్వంభర, ముషీరాబాదు :

ముషీరాబాదు నియోజకవర్గం బాగ్ లింగంపల్లిలో సుందరయ్య పార్క్ సమీపంలో ఫుట్‌పాత్ ఆక్రమణల పేరుతో జిహెచ్ఎంసి అధికారులు గురువారం భారీ పోలీసు బలగాల సహాయంతో చిరు వ్యాపారుల దుకాణాలను తొలగించారు. హైకోర్టు ఉత్తర్వుల నేపథ్యంగా చేపట్టిన ఈ చర్యల్లో జెసిబిలతో షాపులను నేలమట్టం చేశారు. కనీస ముందస్తు నోటీసులు, హెచ్చరికలు ఇవ్వకుండా అకస్మాత్తుగా దుకాణాలు తొలగించడంతో వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు సమయం ఇవ్వకుండా జీవనోపాధిని దెబ్బతీసేలా చర్యలు తీసుకోవడం అన్యాయమని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఫుట్‌పాత్ ఆక్రమణలపై చర్యలు సరేనని, అయితే అదే ప్రాంతంలో ఉన్న అక్రమ కట్టడాలు, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలపై ఎందుకు చర్యలు తీసు కోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మాజీ కార్పొరేటర్ నిర్మించిన అక్రమ కట్టడం, ఒక మాజీ ఉన్నత పోలీసు అధికారి సెట్‌బ్యాక్ స్థలంలో నిర్మిస్తున్న భవనం వంటి అంశాలపై అధికారులు కన్నెత్తిచూడకపోవడం వివాదాస్పదంగా మారింది."పేదలదుకాణాలే టార్గెట్‌గా మారాయా? హైకోర్టు ఉత్తర్వులు ప్రజాప్రతినిధుల అక్రమ కట్టడాలకు వర్తించవా?" అని స్థానికులు నిలదీస్తున్నారు. చిన్నా,పెద్దా తేడా లేకుండా అందరికీ సమానంగా చట్టం అమలు చేయాలని డిమాండ్ చేస్తు న్నారు. రెక్కాడితే గానీ డొక్కాడని తమపై కక్ష సాధింపే చర్యలని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు.